
లవంగాలు

# రాంగ్ నంబర్



"12 న గృహ ప్రవేశం. నువ్వు తప్పక రావాలి. ఏ పరిస్థితుల్లో నైనా సరే- రవి."

టెలిగ్రాం చూసి కేలెండరు వేపు చూశాడు సారథి.

రెండు రోజుల్లో మద్రాసు వెళ్ళాలి. అదేం కష్టం లేదు- సెలవు సులువుగా దొరుకుతుంది. మెయిలుకో.కోరమాండలుకో టికెట్టు దొరుకుతుంది.

కాని. రవి ఏమిటి; గృహప్రవేశం ఏమిటి?

అతన్ని కలిసి సంవత్సరం అయింది. రవి మాంబళంలో చిన్న ఇంట్లో అద్దెకి వుండేవాడు. అతనూ భార్యా ఎలాగో సరి పెట్టుకుని సంసారం చేసేవారు. ఒక్కగది. చిన్న వొంట ఇల్లు. బాత్‌రూమ్ పక్క పక్కన. అంతే అందుకే రవి ఎంత బలవంత పెట్టినా అతనితో వుండకుండా కంపెనీ వాళ్ళెలాగా ఖర్చులు పెట్టుకుంటారు కనక హోటల్ రూమ్ తీసుకుని ఆ నాలుగు రోజులూ వున్నాడు.

రవి అప్పటికి ఆరునెలల కిందనే పెళ్ళి చేసుకున్నాడు. ఇంటర్‌కాస్టు పెళ్ళి అతను లావణ్యని పెళ్ళి చేసుకున్నాడంటే ఆమె అందం చూసే అని సారథి మొదట అనుకున్నాడు. కాని ఆమె ప్రవర్తనా మర్యాదా ఆ నాలుగు రోజుల్లోనూ సారథి ఉద్దేశాలని మార్చివేశాయి. రూపమూ గుణమూ అంత చక్కగా కలిసిపోయి ఒకచోట వుండడం సారథి ఎక్కడా చూడలేదు లావణ్యకన్న ఎంతో తక్కువ అందగత్తెల మీద సారథి ఎన్నోసార్లు మనసు పారేసుకుని బాధలు పడ్డాడు. చాలాసార్లు ఆ బాధ కర్మ విముక్తిగా మాత్రమే మిగిలిపోయేది. కాని కొద్ది సందర్భాలలో సారథికి ఫలితం దక్కకపోలేదు.

కాని మూడోరోజుకి లావణ్యమీద అతను ఉద్దేశాలు మార్చుకున్నాడు. చేతికి అందే చేమంతి కాదామె అని గ్రహించాడు. మనసులో కోరికలు పెట్టుకుని ఆమె పట్ల తాను ప్రవర్తించిన తీరునీ, ఆమె ఎక్కడా తొణకకుండా మర్యాదగా చిరునవ్వుతో అతన్ని దూరంగా ఉంచుతూనే పాఠం చెప్పిన పద్ధతినీ తలుచుకుని సారథి సిగ్గు పడ్డాడు

"మా వాళ్ళూ తన వాళ్ళూ మమ్మల్ని అవుట్ కాస్ట్ చేశారు సారథీ! తనకి వాళ్ళు వాళ్ళంటే ప్రాణం. కాని ఆ మాట కూడా తలుచుకోదు. నాకొక్కటే విచారం ఆమెకి ఒక మంచి చీర కూడా కొనలేని పరిస్థితి నాది. ఈ ఆరు నెలలలోనూ మూడుసార్లు బస్సెక్కి సినిమాలకి వెళ్ళాం- అంతే



ఆమెకి మొక్కలంటే ఎంతో ఇష్టం. పార్కుకి నడిచి వెళ్ళి వొస్తే ఎంతో ఆనందిస్తుంది. స్వీట్ గర్ల్! అదే నా బాధ . తనకేమీ చెయ్యలేను" అంటూ విచారించాడు

ఇంద్రగిరి చంద్రమతి

రవి. సారథి ధనవంతుడు కాదు. అయినా తాను చేసే సహాయం రవి స్వీకరించడు. లావణ్య వొచ్చాక అతను ఇంకా తన ఆత్మగౌరవం పెంచుకున్నాడు. అయినా వుండబట్టక "ఏదైనా హెల్పు చెయ్యనీ బ్రదర్!" అన్నాడు సారథి

రవి తల ఊపి. "అలాటిది నాకు వద్దు- నీకు తెలుసును. కాని ఒక పని చెయ్యి. నాకు పెయింటింగ్ సరదా వుందని నీకు తెలుసుగా! దానిమీద అభిమానమున్న వాళ్ళెవరైనా ఉత్తములు వుంటే పరిచయం చెయ్యి" అన్నాడు. అది జరిగే పని కాదని తెలిసినా, ప్రయత్నించే సదుద్దేశంతో సారథి రవి దగ్గర ఆరు విజిటింగ్ కార్డులు తీసుకున్నాడు. అడపా తడపా చిన్న పత్రికలలో అచ్చు కావడం తప్ప రవి కళకి ఏమీ పాపులారిటీ లేదు. రవిమీద అభిమానం గౌరవం కొద్దీ ఆ కార్డులు తన పర్సులో జాగ్రత్తగా పెట్టుకున్నాడు.

అందులో ఒక కార్డు మాత్రం ఇచ్చాడు.

"వెడతారా?" అంది కామాక్షి.

"వెళ్ళాలి. వెడతాను" అన్నాడు సారథి

ఆమె ఉద్దేశం ఏమిటో అతనికి తెలుసును. సారథి ఊరు వొదలితే చాలు- రాత్రీ పగలూ గౌరవనీయులుకాని ఆడవాళ్ళతో గడుపుతాడని ఆమె అనుమానం- కాదు నమ్మకం. అలాగే ఆఫీసులో ఆడవాళ్ళు అందరూ అతని చుట్టూ చేరి రోజంతా మోహన లీలల్లో గడుపుతారనీ ఆమె నమ్ముతుంది. ఇది నిజానికి సారథి కోరికలు— కాని ఒక కాతమో రెండో కన్న తీరనివి.

"ఈ ప్రయాణానికి డబ్బు పరవాలేదు. కావాలా!" అంది కామాక్షి.

మరొక జత గాజులూ. ఒక నెక్లెసూ కావాలని ఆమె ఆరేళ్ళ నించి పోరుతోంది. పిల్లల చదువులూ. ఆడిట్‌లోకి రాని తన ఖర్చులూ నిత్యావసరాలూ పోగా సారథి దగ్గర ఎక్కువ ఏమీ మిగలదు. ఈ ఆరేళ్ళ నించీ ఇంట్లో చీకటిలో కోల్డ్‌వార్‌కి ఈ ఆర్థిక అనర్థం మరొక కారణం.

సారథి జవాబివ్వలేదు.

మర్నాడు రైలెక్కాడు. చాలా కాలం తరవాత రవినీ లావణ్యనీ చూడడం అతనికి సరదాగా వుంది. రవికి ఇంతత్వరగా ఇల్లెలాగ వొచ్చిందో సారథికి చాలా క్యూరియస్‌గా వుంది.

రవి కార్డులు అతనికి మళ్ళీ జ్ఞాపకం వొచ్చాయి. రవి కానీ తన చిత్రాలని ఏ అమెరికన్ మిలియనీరుకైనా అమ్మేడా? అలాటిదేమీ అయివుండదు. రవి కళలో అంత ప్రత్యేకత ఏమీ లేదు. పెయింటింగ్‌కి నూరు రూపాయలు వొస్తే గొప్ప....

అతన్నే అడగ వచ్చులే అనుకున్నాడు సారథి.

కాని ఆ విజిటింగ్ కార్డు-రవిది....

కిటికీ బయట కనిపించేవన్నీ త్వరగా వెనక్కి పోతున్నాయి. సారథికి సంవత్సరం కింద గడిచిన ఒకరాత్రి జ్ఞాపకంవొచ్చింది. ఆ రాత్రి ఎవరికో మోసం జరిగింది- అన్యాయం జరిగింది. కామాక్షికా? లేక....

ఆ రాత్రిని మరచిపోయేందుకు చాలా ప్రయత్నం చెయ్యలేదు సారథి. ఇవేళ రవీ అతని విజిటింగ్ కార్డూ జ్ఞాపకం రాగానే ఆ నాటి చిన్న కథ మనసులో మెదిలింది. అంతే.

ఆ రోజు బొంబేలో ఉన్నాడతను. అర్జెంటుగా కంపెనీ పనిమీద రావాల్సి వొచ్చింది. ప్రెసిడెంటు హోటలుకి ఆఫీసు వాళ్ళు టెలిగ్రాము ఇచ్చారు. అతను బొంబే చేరే సరికి రాత్రి ఎనిమిది దాటింది. హోటలుకి చేరేసరికి తొమ్మిది.

అక్కడ రూము దొరకలేదు. కంపెనీ వాళ్ళ టెలిగ్రామ్ చేరలేదుట. చేరినా లాభం ఉండేది కాదని ఓదార్పుగాచెప్పేరు వాళ్ళు. తాజ్ మొదలు ఆరేడు హోటళ్ళకి ఫోన్ చేశాడు. కాని అందరూ ఓవర్ బుక్‌డ్ అన్నారు. లౌంజ్‌లో దిగులుగా కూర్చున్నాడు సారథి. బొంబేలో అతనికి ఒకరిద్దరు స్నేహితులు ఉన్నారు. కాని వాళ్ళెక్కడో అంధేరి అవతల ఉన్నారు. చిన్న చిన్న ఉద్యోగులు—వాళ్ళ అడ్రస్‌లు అతనికి సుమారుగా కూడా తెలియవు.

అతనికి చాలా అలసటగా ఉంది. రేపు ఉదయం తొమ్మిదినించీ చాలా ముఖ్యమైన కాన్ఫరెన్సు ఉంది. అది ముగించుకుని సాయంత్రం తిరిగి వెళ్ళిపోవాలి. ఆ కాన్ఫరెన్సులో తాను సాధించవలసింది చాలా ఉంది.... ఏం చెయ్యాలి? ఈ రాత్రి ఎలాగ గడపాలి?

సూట్‌కేసు రిసెప్షన్‌లో పెట్టి సారథి బార్‌లోకి వెడుతూంటే "ఎక్స్క్యూజ్‌మీ" అని ఎవరో అన్నారు. ఆమె ఒక సోఫాలో కూర్చుని పేపరు చదువుతోంది. చక్కటి గొంతుక.... ఆ లేత వెలుగులో ఆమె చాలా హుందాగా కనిపించింది. ఇదోకటా! అనుకుని కేవలం మర్యాదకోసం. "కెన్ ఐ హెల్ప్ యూ?" అన్నాడు సారథి

అవును. ఆమెకి బార్‌కి వెళ్ళాలనిఉంది. కాని అక్కడ అందరూ మగవాళ్ళు. సారథితో రావొచ్చునా? అతను మర్యాద తెలిసిన మనిషిలాగ ఉన్నాడు కనక సాహసంచేసి అడిగింది. అతనికి అభ్యంతరం ఉంటే క్షమించి మరిచిపొమ్మంది.

ఆమె మాట తీరూ. ఆమెలో ఒక తీవీ ఆ చక్కని భాషా అతనికి ఆమెమీద గౌరవం కలిగించాయి. ఆమెకి నాలుగు పదులు తక్కువ వయసుండదు. కాని ఆమె గొంతుక చాలా మృదువుగా ఉంది.

"రండి-మైప్లెజర్" అన్నాడు సారథి. వాళ్ళిద్దరినీ చూడగానే లోపల చాలా మర్యాదలు చేశారు. సారథి విస్కీ ఆర్డరుచేశాడు ఆమె బ్లడీ మేరీ అడిగింది.

"నా పేరు అమల...." అంది సారథి తన పేరు చెప్పలేదు—"నైస్ నేమ్" అన్నాడు. అంతే ఆ తరవాత వాళ్ళిద్దరూ మాటల్లో పడ్డారు. ఆమె అతనిని గురించి అడగనూ లేదు-తనని గురించి చెప్పుకోనూ లేదు. హాయిగా గంటన్నర గడిచిపోయింది. ఆమె మాటలు విన్నకొద్దీ ప్రవర్తన గమనించినకొద్దీ సారథికి ఆమెమీద గౌరవం ఎక్కువ అయింది.

"ఇంక వెడదాం" అందామె. సారథి తన పర్స్ తీసే లోపున బేరర్ బిల్లుమీద ఆమె సంతకం తీసుకున్నాడు. 'ఫర్గివ్‌మీ!' అంది ఆమె. సారథి సిగ్గుపడ్డాడు. ఆమె పర్సులో ఉన్న రూమ్ కీ తాను గమనించనే లేదు!

"మీ దేరూము?" అంది అమల లిఫ్టుల వేపు నడుస్తూ. సారథి తన పరిస్థితి చెప్పేడు. ఆమె క్షణం నిలబడి ఆలోచించి రిసెప్షన్‌కి వెళ్ళి అక్కడి అమ్మాయికి ఏదో చెప్పివొచ్చి, "నా రూమ్‌కి రండి-డిన్నర్ తీసికొనేసరికి ఏదో ఏర్పాటు జరుగుతుంది" అంది. ఆ మాటల్లో మర్యాద. ఆప్యాయతా గమనించి సారథి ఆమె సూచన ప్రకారం స్నానం చేసి వచ్చాడు. రూమ్‌లోకి వచ్చేసరికి విస్కీలో తేలుతూ రెండు ఐస్ ముక్కలు అతనికి స్వాగతం చెప్పాయి.

"మీకు కావాలని అనుకున్నాను" అంది అమల చిరునవ్వుతో.

క్షణ క్షణానికి ఆమె మీద గౌరవం పెరిగింది.

అంతకన్నా వేగంగా ఆమె మీద కోరిక; ఉపవాసాలు చేసి చేసి మధ్యన సగం ఆకలి చంపుకు తింటూ బ్రతికిన వాడికి అందమైన భోజనం ఘుమ ఘుమ లాడుతూ కనిపిస్తే కలిగే కోరిక.

డిన్నర్ ముగిశాక ఆమె లైటు తీసేసింది. మాటలు లేకుండానే నిద్దర రాకుండానే ఆ రాత్రి గడిచిపోయింది. ఉదయం

కాబోతుంటే అతను నిద్రపోయాడు. ఆమె అతన్ని ఎనిమిదవుతూంటే లేపింది. అర గంటలో తయారయి సారథి బ్రేక్ ఫాస్ట్ ముగించి సూట్ కేస్ కిందకి పంపి ఆమె దగ్గర సెలవు తీసుకున్నాడు. 'థేంక్స్ అమలా— ఫర్ ఎవ్వెరి థింగ్' అన్నాడు.

"యువార్ మార్వెలస్! జన్మాంతం మరచిపోను" అంది అమల. కొంచెం సందేహంగా "మీ పేరుకూడా తెలీదు నాకు— అభ్యంతరం లేకపోతే మీ కార్డు ఇవ్వండి" అంది.

సారథికి మీనాక్షీ, పిల్లలూ, ఆమె అనుమానాలూ జ్ఞాపకం వొచ్చాయి. అమల దృష్టిలో తాను దేవుడులాగ వున్నాడు. ఆమె అనాలోచితంగా ఏమైనా చేస్తే! అదీ కాక ఆమె వయసు యాభై వసంతాలు దాటి కొంత కాలం అయిందని స్పష్టంగా తెలుస్తోంది.

పర్సు తీసి రవి కార్డు ఇచ్చాడు. "గుడ్ బై అమలా!" అన్నాడు.

ఆమె ఆ కార్డు పర్సులో పెట్టి "గుడ్ బై డార్లింగ్!" అంది. సారథి బయటకి వొచ్చి టాక్సీలో కూర్చుని తన రిలీఫ్ అంతా ఉట్టిపడేలాగ ఒక నిట్టూర్పు విడిచాడు. అదంతా తలుచుకొని మళ్ళీ మరొక నిట్టూర్పు విడిచాడు. ఈ సారి బొంబే వెడితే ప్రెసిడెంటు హోటల్ నించి ఆమె ఆరా తీయాలనుకున్నాడు.

ఆ తరవాత అతను నిద్రపోయాడు.

రవి స్టేషను కొచ్చాడు. తిన్నగా కొత్త యింటికి తీసికెళ్ళాడు. చాలా చక్కగా వుంది.

"రెండు లక్షలయింది" అన్నాడు రవి. సారథి ముఖంలో ఆశ్చర్యాన్ని చూసి "పద హోటల్లో బుక్ చేశాను నిన్ను. ఈ రాత్రి దాకా...." అన్నాడు. కారులో కూర్చుని "ఇది నా కారే!" అన్నాడు.

"లాటరీ కొట్టావా!" అన్నాడు సారథి. రవి చాలా చాలా ఎదిగిపోయాడు.

"లేదు సారథీ!- ఇదంతా ఒక మిస్టరీ! ఉన్నట్టుండి ఒక నాడు కలకత్తా నుంచి ఒక ఉత్తరమూ, చెక్కూ వొచ్చాయి. ఎవరో అమలా ముఖర్జీట. ఆమె హఠాత్తుగా చని పోయిందట. విల్లు ప్రకారం ఐదు లక్షల ఆస్తి నాకు రాసిందిట— అంతే. నాది కాదని మొత్తుకున్నా లాభంలేక పోయింది. సరేనని చిన్న వ్యాపారం పెట్టాను ... కలిసొచ్చింది."

ఏమేమో చెప్తున్నాడు రవి.

సారథికి ఏమనాలో, ఏమనుకోవాలో తెలియలేదు.

ముఖం తిరిగినట్టయింది. గొంతుక ఎండి పోయింది

చాలాసేపటిదాకా అతను మాట్లాడలేదు. పూర్ ఫెలో!

# నాటకరంగం

ఆంధ్రప్రదేశ్ సచివాలయ సాంస్కృతిక సంస్థ కొన్నేళ్ళు ఆంధ్ర నాటక రంగానికి ఎనలేని సేవ చేసింది. ఆ సంస్థ ద్వారా వెలుగులోకొచ్చి, తనదంటూ ఓ బాణీ సృష్టించుకున్న నటులలో శ్రీ బి.వి. రామారావు అగ్రగణ్యుడు.

విజయనగరం జిల్లా సాలూరులో ఊహ రాకముందే రంగస్థల మెక్కి, "భక్త ప్రహ్లాద"లో చండామార్కుడిగా, "శ్రీనివాస కల్యాణం"లో ద్వారపాలకుడిగా నటించినా 1959లో "ఆశయాలకు సంకెళ్ళు" నాటకంలో బెనర్జీ వేషానికి ఉత్తమనటుడిగా బహుమతి పొందాకనే శ్రీ రామారావు నటుడిగా గుర్తింపు పొందాడు. దానికితోడు ప్రముఖ నటుడు శ్రీ కె. సిద్దప్పనాయుడు సహకారం, ప్రోత్సాహం శ్రీ రామారావును ఆంధ్ర నాటకరంగంలో ప్రముఖుడిగా తీర్చిదిద్దాయి.


## శ్రీ బి. వి. రామారావు

అనంతపురంలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్ పోటీలలో సెక్రెటేరియట్ కల్చరల్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన "మనిషిలో మనిషి" నాటకంలో పాల్గొని అందరికీ పరిచయమైనాడు. ఇదీ తొలి అధ్యాయం

చిన్ననాడు స్వగ్రామంలో కీర్తిశేషులు షేక్ హుస్సేన్‌గారి నాటకాలు చూడటం, తద్వారా ప్రభావితుడై కావటం, ప్రముఖ ప్రయోక్త ప్రఖ్య శ్రీరామమూర్తిగారి సాహచర్యం అన్నీ కలిసి, 1965 లో శ్రీ రామారావు నటుడు, దర్శకుడు అయినాడు. నటరాజ కళానిలయం నెలకొల్పి ఆంధ్ర నాటక కళాపరిషత్‌లో వరుసగా "మంచు తెర", "రెండు రెళ్ళు ఆరు", "పావలా", "కళ్ళు" నాటికలు, "లావాలో ఎర్ర గులాబీలు", "కరుణించని దేవతలు" నాటకాలు ప్రదర్శించి నటనకు, దర్శకత్వానికి బహుమతులు పొందారు. "కళ్ళు" నాటిక ప్రదర్శించిన ప్రతిచోటా ప్రేక్షకుల మన్ననలే కాదు, న్యాయ నిర్ణేతల ఆదరణ బహుమతులూ పొందారు. అంతే కాదు 1970లో అలహాబాద్‌లో జరిగిన అఖిలభారత స్థాయి నాటక పోటీలలో ఉత్తమ నటనకూ దర్శకత్వానికి బహుమతులు సంపాదించి తెలుగువారి జయపతాకను ఉత్తర భారత దేశంలో ఎగురవేయడం జరిగింది.

శ్రీ చాట్ల శ్రీరాములు, శ్రీ జె. యల్. నరసింహారావుగార్లతో కలిసి విద్యానగర్ కల్చరల్ ఎసోసియేషన్ వారి "డామిట్-కథ అడ్డం తిరిగింది" నాటకంలో నటించి ఢిల్లీ, మద్రాసు లాంటి నగరాల్లో ప్రదర్శన లివ్వడమేగాక క్రమశిక్షణ, ప్రదర్శనలో ప్రయోగ పద్ధతులు, తెలుసుకునేందుకు అవకాశం కల్పించాయి.

ప్రముఖ సంస్థ, కళాసాగర్ మద్రాసు



వారు 1979 లో ఉత్తమ నటుడుగా ఎన్నిక చేసి, మద్రాసు యూనివర్శిటీ ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు.

నలభై ఎనిమిది సంవత్సరాలలో శ్రీ బి. వి. రామారావు పొందని గౌరవం లేదు. సినిమాలు ఆకర్షించాయి. అయితే ఆ భ్రమకు లొంగలేదు నాటకరంగం మీది అభిమానంవల్ల.

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఉద్యోగం చేస్తున్న శ్రీ బి. వి. రామారావు గత కొన్నాళ్ళుగా రికామీగా ఉండటం నాటకాభిమానులకు విచారం కలిగించే విషయం.

—తారకరామారావు